క్లుప్తంగా

భూ సమస్యలపై క్షేత్రస్థాయిలో విచారణ



నడికూడ: భూ సమస్యలపై భూ భారతి చట్టం ద్వారా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ నాగరాజు అన్నారు. బుధవారం మండలంలోని పులిగిల్లలో కౌకొండ గ్రామాల్లో భూభారతి చట్టం పై జరిగిన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రెండు రెవెన్యూ బృందాల ద్వారా భూ సమస్యలపై పులిగిల్లలో 147, కౌకొండలో 98 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఒక రోజు ముందుగానే గ్రామాల్లో భూ భారతి సదస్సు గురించి దండోరా వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

12న ఓంకార్ శతజయంతి ఉత్సవాలు



శాయంపేట : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ ఓంకార్ శత జయంతి వేడుకలను ఈనెల 12న సాయంత్రం 4 గంటలకు గీసుకొండ మండలం మచ్చాపూర్‌లోని ఓంకార్ స్తూపం వద్ద నిర్వహించనున్నట్లు ఎంసీపీఐ(యూ) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసరెడ్డి బుధవారం తెలిపారు. బుధవారం మండలంలోని ప్రగతి సింగారంలో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సభకు ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, మేధావులు, కవులు, కళాకారులు, విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు నీల రవీందర్, ఎండీ ఉస్మాన్, పెంట తిరుపతి, కూసం బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

దళితరత్న అవార్డు అందజేత



ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల గ్రామానికి చెందిన టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ అర్షం అశోక్ దళితరత్న అవార్డు అందుకున్నాడు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నాడు. అశోక్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని సేవలు అందిస్తానని అన్నారు.

టీడీపీ మండల కమిటీ ఎన్నిక

ఆత్మకూరు : మండల కేంద్రంలో బుధవారం టీడీపీ మండల కమిటీని టీడీపీ నియోజకవర్గ బాధ్యులు కందుకూరి నరేష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోనె మధుకర్, ఉపాధ్యక్షులుగా రాజేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శిగా పెండ్లి రమణ, కొక్కరకొండ కుమారస్వామి కార్యనిర్వాహక కార్యదర్శిగా రాజమౌళి సమ్మయ్య, కార్యదర్శులుగా వెంకన్న, రాజమౌళి నియమితులైనట్లు నరేష్ ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకట్రాజం గౌడ్, రాజు నాయక్ పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



శాయంపేట : రైతులు తమ పంటలకు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ దిలీప్‌కుమార్, డాక్టర్ విశ్వాతేజ్‌లు అన్నారు. బుధవారం మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి గంగాజమున ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలని, అవసరమైన మేరకు రసాయనాలు వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, పురుగుల మందుల రశీదులను భద్రపరుచుకోవాలన్నారు. పంట మార్పిడి, చెట్లను పెంచడం, సాగునీటి ఆదా చేయడం వలన కలిగే ప్రయోజనాలను వారు రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ రాకేష్, పంచాయతీ కార్యదర్శి నాగశ్రీ, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

పరకాలలో ‘ఇందిరమ్మ ఇళ్ల’ గోల..!

- ఎల్–1 లో ఉన్న జాబితాలో లేని పేర్లు.. ఆందోళనలో లబ్ధిదారులు
- కార్యకర్తలు, కుటుంబ సభ్యులకే ఇళ్లు
- ఇందిరమ్మ కమిటీల తీరుపై అధికారుల ఆందోళన
- అనర్హులు ఉన్నారంటూ.. జాబితా తయారీకి నిరాకరణ
- కలెక్టర్, ఎమ్మెల్యేకు ఫిర్యాదు



పరదాల చాటున నివాసం ఉంటూ ఇందిరమ్మ ఇల్లు కోసం ఎదురుచూస్తున్న మహిళ

పరకాల : గత ప్రభుత్వంలా కాకుండా అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి నీడను ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదే..అనర్హులకు కానీ..పైరవీలకు కానీ ఎలాంటి ప్రాధాన్యత ఇచ్చే ప్రసక్తే లేదని ఒక వైపు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు ఇందిరమ్మ కమిటీ సభ్యులు మాత్రం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తమకు నచ్చిన వారికి..బంధువులకు ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో ప్రాధాన్యత ఇస్తుండడం విశేషం. ఇందిరమ్మ కమిటీలు సూచించిన జాబితాలోని పేర్లు చూసి హౌసింగ్, మున్సిపల్ అధికారులు ససేమిరా ఒప్పుకోకపోవడం.. జాబితాను తిరిగి పంపించడంతో పాటు అర్హులైన వారి పేర్లు ఎంపిక విషయంలో కమిటీల పనితీరుపై కొందరు ప్రజాసంఘాల నాయకులు సోషల్ మీడియా వేదికగా జిల్లా కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు ఫిర్యాదులు చేయడం కూడా ఇందుకు సాక్ష్యంగా చెప్పవచ్చు. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డులకు 425 మందికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కుటుంబాల సంఖ్యను బట్టి ఒక్కో వార్డుకు 35 నుంచి 18 వరకు ఇళ్లు కేటాయించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జిల్లాలో అనేక చోట్ల పూర్తయినప్పటికీ స్థానిక మున్సిపాలిటీ పరిధిలో లబ్ధిదారుల ఎంపికలో అనేక రాజకీయాలు చోటుచేసుకోవడంతో ఆలస్యమవుతున్నట్లు సమాచారం. వాస్తవానికి పరకాల నియోజకవర్గంలో చాలామంది గృహలక్ష్మి పథకం కింద బేస్‌మెంట్, పిల్లర్స్ నిర్మాణం పూర్తి చేసుకున్నప్పటికీ ఎలాంటి బిల్లు రాలేనివారు వేల సంఖ్యలో ఉన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి గృహలక్ష్మి లబ్ధిదారులను దూరంగా ఉంచడంపై ఇప్పటికే


శ్రీయుత గౌరవ నీయులైన ప్రావిణ్య జిల్లా కలెక్టర్ హనుమకొండ గారికి...

తెలంగాణ రాష్ట్రంలో...
భారత రాజ్యాంగం అమలు కావడం లేదు
రెడ్డి రాజ్యాంగం అమలవుతోంది..

పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వకుండా

ఇందిరమ్మ ఇళ్లలో అవకతవకలపై కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు వాట్సాప్‌లో ఫిర్యాదు చేసిన దృశ్యం

గొడవ జరుగుతుండగా మరోవైపు ఇళ్ల ఎంపికలో కమిటీ సభ్యులు పారదర్శకత పాటించకుండా కేవలం తమకు అనుకూలంగా ఉండేవారితో పాటు బంధువులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాము సూచించిన వారిని లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించకూడదని పట్టుబడుతున్నారు. అయితే అధికారులు మాత్రం అందుకు ఒప్పుకోకుండా కొన్ని వార్డుల జాబితాలను రెండు సార్లు వెనుకకు పంపించినట్లు తెలిసింది. అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు కొందరు నేతలు..ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అర్హులైన వారికి అన్యాయం కాకుండా చూడాలని అధికారులకు సూచించడంతో ఇప్పటికే సిద్ధమై ఉన్న 22 వార్డుల లబ్ధిదారుల జాబితాలో మళ్లీ మార్పులు ఉండక తప్పదని తెలిసింది. ప్రజా సంఘాల నాయకులు మాత్రం అర్హులకు, గృహలక్ష్మి లబ్ధిదారులకు అన్యాయం జరిగితే ఊరుకోమని స్పష్టం చేస్తున్నారు.

అర్హులైన వారికి న్యాయం చేయాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల మంజూరీలో ఎలాంటి వివక్షత చూపించకుండా అర్హులైన వారిని మాత్రమే ఎంపిక చేయాలి. మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాంగ్రెస్ కార్యకర్తలకు, బంధువుల పేర్లు మాత్రమే జాబితాలో పెట్టడం విడ్డూరంగా ఉంది. గృహలక్ష్మి లబ్ధిదారులను కూడా ఇందిరమ్మ ఇళ్లలో చేర్చి వారికి బిల్లులు మంజూరు చేయాలి. లేని పక్షంలో పేదల పక్షాన ఆందోళనలు చేపడతాం.

– బొచ్చు చిన్ని కృష్ణ,
అంబేద్కర్ యువజన సంఘం,
పరకాల అధ్యక్షుడు

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల : కాంగ్రెస్ పార్టీ నిర్మాణంతో పాటు కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన పరకాల నియోజకవర్గ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశానికి వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, టీపీసీసీ పరిశీలకులు మస్కుద్ అహ్మద్, అమీర్ అలీ ఖాన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య, ఏఐసీసీ ఎస్సీ కో ఆర్డినేటర్ డాక్టర్ పులి అనిల్‌కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కూచన రవళి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి బలంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సంస్థాగత నిర్మాణం బలంగా ఉంటే పార్టీకి ఎలాంటి ఢోకా ఉండదన్నారు. పార్టీ పరిశీలకులు మస్కుద్ అహ్మద్, అమీర్ అలీ ఖాన్ మాట్లాడుతూ ఈ నెల 20 నాటికి డీసీసీ అధ్యక్షులను, ఇతర కమిటీ నియామకాలు చేపడతామన్నారు. 2017 నుంచి పార్టీ మారని వారికి పదవులు, నామినేటెడ్ పదవులు అవకాశాలు కల్పించాలని అధిష్టానం సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, శ్రీకుంకుమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్ రావు, కాంగ్రెస్ పరకాల, ఆత్మకూరు, గీసుకొండ, సంగెం, దామెర, నడికూడ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బందిపై డీఎంహెచ్‌ఓ ఆగ్రహం

- ఆయుష్మాన్ ఆరోగ్య సెంటర్‌ను తనిఖీ చేసిన డాక్టర్ అప్పయ్య



ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

హసన్‌పర్తి : విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆరోగ్య సిబ్బందిపై జిల్లా వైద్య ఆరోగ్య అధికారి అప్పయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పెగడపల్లిలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అయితే వ్యాక్సిన్ కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. జాబితా ప్రకారం ఎంత మంది పిల్లలకు టీకాలు వేయాల్సి ఉందని అడిగారు. పీహెచ్‌సీ నుంచి తీసుకొచ్చిన వ్యాక్సిన్‌లను పరిశీలించారు.వ్యాక్సిన్ కోసం వచ్చిన గర్భిణీలు, మహిళలతో మాట్లాడారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ద్వారా అందుతున్న సేవల తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సిబ్బంది ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం అందుబాటులో ఉంటున్నారా అని అడిగారు. అనంతరం గ్రామంలోని వివిధ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ వర్గాలతో మాట్లాడారు. బీపీ, షుగర్ పరీక్షలు చేస్తున్నారా అని అడిగారు. మందులు ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.ఫైలేరియా వ్యాధితో బాధపడుతున్న వ్యక్తిని పరీక్షించారు.

కేన్సర్‌ను ముందే గుర్తిస్తే నయం చేయవచ్చు

- ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హిక్తేదార్ హైమ్మద్



మాట్లాడుతున్న ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హైమ్మద్

ఎల్కతుర్తి : కేన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి, తగిన చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడొచ్చని ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హిక్తేదార్ హైమ్మద్ అన్నారు. బుధవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని స్వకృషి మహిళా డైయిరీలో వంగర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కేన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో కేన్సర్ ప్రారంభ లక్షణాలు, తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై సమగ్ర సమాచారాన్ని అందించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ రుబీనా మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించి, స్క్రీనింగ్ ద్వారా ముందస్తు చర్యలు తీసుకోవడం ఎంతో కీలకమన్నారు. మహిళా ఆరోగ్యం ఇంటికి సౌభాగ్యమని, వంగరలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతీ మంగళవారం మహిళలకు ఆరోగ్య మహిళా ప్రోగ్రాం ద్వారా స్పెషల్ హెల్త్ క్యాంప్ నిర్వహించబడుతుందన్నారు. కార్యక్రమంలో డెయిరీ అధ్యక్షురాలు ధనశ్రీ, డాక్టర్ రహమాన్, సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు, తదితర మహిళలు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



వేలేరు : ఇటీవలే కురుస్తున్న అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని భూమాత రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సమ్మయ్య యాదవ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో ఉన్న రైస్ మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తీసుకెళ్లిన రైతుల నుంచి ఒక క్వింటాకు 5 కిలోల చొప్పున కటింగ్ చేస్తున్నారని అన్నారు. 5 కిలోల చొప్పున కటింగ్‌కు అంగీకరించని రైతులు ధాన్యాన్ని దిగుమతి చేసుకునేందుకు రైస్‌మిల్లర్లు నిరాకరిస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించడంతో పాటు, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ రైతులను మోసం చేస్తున్న రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భూమాత రైతు సంక్షేమ వర్కింగ్ ప్రెసిడెంట్ సాదం గట్టయ్య, ప్రధాన కార్యదర్శి పరమేష్, ములుగు, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు బండారి ప్రశాంత్, మేకల దశరథం, నాయకులు రాజేశ్వర్,నరహరి తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

- ఎంపీడీఓ గుండె బాబు



మాట్లాడుతున్న ఎంపీడీఓ గుండె బాబు

కమలాపూర్ : సమాజంలో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీడీఓ గుండె బాబు, ఎంఈఓ కె.శ్రీధర్ సూచించారు. మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, మహిళా సంఘాల సభ్యులు, విలేజ్ ఆర్గనైజర్స్, ఆర్గనైజింగ్ అసిస్టెంట్లకు కమలాపూర్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన బడిబాట విద్యార్థుల నమోదు (ఉల్లాస్), న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాంలో వారు మాట్లాడారు. స్థానిక పాఠశాలల ఉపాధ్యాయులు, మహిళా సంఘ సభ్యులు పాఠశాల స్థాయిలో ఎటువంటి డ్రాపౌట్స్ లేకుండా, బడిబయట పిల్లలు ఉండకుండా చూడాలని, 15 ఏళ్లు పైబడిన నిరక్షరాస్యులైన వయోజనులు, దివ్యాంగులు, 10వ తరగతి చదివి మధ్యలో చదువు ఆపేసిన పిల్లల వివరాలు సేకరించాలన్నారు. వయోజనులకు చదువు చెప్పే స్వచ్ఛంద బోధకులను, సామాజిక విద్యా కేంద్రాలను గుర్తించాలని, వలంటీర్లుగా గుర్తించిన వారికి ఉల్లాస్ యాప్‌పై శిక్షణ, అంగన్‌వాడీ పిల్లలు, దివ్యాంగుల ధృవీకరణ పత్రాలు, నిరక్షరాస్యులైన వయోజనుల వివరాలు సేకరించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయడం, బడి మధ్యలో మానేసిన వారిని సార్వత్రిక పాఠశాలలో చేర్పించుట వంటి అంశాలపై వివరించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల నమోదు కోసం బడిబాట కార్యక్రమంలో చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శివప్రసాద్, ఏపీఎం నారాయణ, హెచ్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజల మధ్య బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. వేద పండితులు తొళ్ళక్కం, అధ్యయనోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాధవమూర్తి మాట్లాడుతూ ఈనెల 12 వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని కోరారు.

బీఆర్‌ఎస్ నాయకులవి నిరాధార ఆరోపణలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కమలాపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంపై బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు గుండపు చరణ్‌పటేల్, హుజూరాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ ఒక్కరికైనా డబుల్‌బెడ్రూం కట్టిచ్చిందా అని, మండలంలో నిర్మాణం పూర్తయి డబుల్ బెడ్రూం ఇళ్లను ఇళ్లు లేని ఏ ఒక్కరికైనా పంపిణీ చేశారా అని ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ కొనసాగుతోందని, ఇందుకోసం అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి అర్హులను గుర్తిస్తున్నారన్నారు. పదేళ్ల మీ పాలనలో బీఆర్‌ఎస్ కార్యకర్తలకు లబ్ధి చేకూరిందా? నిజమైన అర్హులకు లబ్ధి చేకూరిందా? అనే విషయంతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు చేసిన ఆరోపణలపై తాము చర్చకు సిద్ధమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన కొనసాగుతోందన్నారు. మీరు అవినీతి, అక్రమాలకు పాల్పడి దొంగే దొంగ అన్నట్లు వ్యవహరిస్తూ కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తౌటం రవీందర్, పోడేటి భిక్షపతి, పర్శరాములు, నారాయణరెడ్డి, మహేష్, రమేష్,రవి, శోభన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కానిపర్తి కారోబార్ హఠాన్మరణం



ఆంజనేయులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ బాబు

కమలాపూర్ : మండలంలోని కానిపర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో కారోబార్‌గా పనిచేస్తున్న సన్నపు ఆంజనేయులు మంగళవారం అర్ధరాత్రి హఠాన్మరణం చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి అన్నం తిని పడుకున్న ఆంజనేయులు(49) అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత మలవిసర్జనకని వెళ్లి తిరిగి ఇంట్లోకి వస్తున్న క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానికంగా వైద్య చికిత్సలు చేయించి 108కు సమాచారం ఇవ్వగా వారు వచ్చేసరికే మృతి చెందినట్లు తెలిపారు. కారోబార్ మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న ఎంపీడీఓ గుండె బాబు ఆంజనేయులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. అనంతరం ఆంజనేయులు దహన సంస్కారాల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు అందజేశారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

నడికూడ : తాగుడుకు బానిసై వ్యక్తి ఉరేసుకొని మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పరకాల పోలీసుల వివరాల ప్రకారం.. నడికూడకు చెందిన బండారి శ్రీను (37) కొన్ని రోజుల నుంచి ఎలాంటి పని చేయకుండా తరుచూ మద్యం సేవిస్తుండడంతో భార్య మందలించింది. భార్యతో గొడవ పడడంతో భార్య, పిల్లలను తీసుకొని తమ తల్లిగారి ఇంటికి పోవడంతో మంగళవారం రాత్రి మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకొని మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పరకాల పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు, మృతుడి భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ..



ఐలమ్మ(ఫైల్)

నడికూడ : కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని నర్సక్కపల్లెలో బుధవారం చోటుచేసుకుంది. పరకాల పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కోడెపాక ఐలమ్మ (65) బంగారు ఆభరణం చేయించాలని భర్తతో గొడవపడి మనస్తాపం చెంది మంగళవారం పురుగుల మందు తాగగా చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి భర్త కోడెపాక సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం



ఆత్మకూరు : పూజలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో బుధవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పానుగోటి ప్రభాకరాచారి మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సలేంద్ర వినోద్ ఆచార్య, ఉపాధ్యక్షులు ఉప్పునూతల అన్నమాచారి, పానుగోటి సత్యనారాయణ, కోటిలింగాచారి, శ్రీనివాస్, గురుసాయి, కోటి, రాజేశ్వర చారి, చరణ్ శర్మ పాల్గొన్నారు.

నడికూడ : స్థానిక పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి చిత్రపటానికి విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు బుధవారం పూలమాల వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి ఆరాధన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మలహాల్‌రావు, నరేందర్ చారి, రాజు, రాజేందర్, సాంబయ్య, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



నడికూడలో..

బాధిత కుటుంబానికి పరామర్శ



వెంకటయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కీర్తిరెడ్డి

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన కొంగరి ఆకేమ్మ, వెంకటయ్య ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి బుధవారం వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట బీజేపీ మండల అధ్యక్షుడు రామకృష్ణ, మల్లారెడ్డి, నాగరాజు, సుమన్, శివ,రాకేష్‌రెడ్డి ఉన్నారు.

శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి కి చెందిన కురాకుల రమేష్ తండ్రి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రమేష్‌తో పాటు 2009–10 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బుధవారం రమేష్‌ను పరామర్శించి రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు.

పాకిస్తానీయులను రాష్ట్రం నుంచి పంపించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కమలాపూర్ : కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం పాకిస్తానీయులు, బంగ్లాదేశ్ రోహింగ్యాలను రాష్ట్రం నుంచి పంపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే పాకిస్తానీయులు, బంగ్లాదేశ్ రోహింగ్యాలను గుర్తించి వారిని ఆయా రాష్ట్రాల నుంచి పంపించి వేశారన్నారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు శోభన్, అరవింద్, ప్రవీణ్, రత్నాకర్, రమేష్‌బాబు, శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, అశోక్, కుమారస్వామి, భాస్కర్, రాజేశ్వర్‌రావు, రామారావు, రాములు, జయశంకర్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.